పెద్దకథ ▼

# ఆదికథ

◇ సత్యానంద్ ◇

పెద్ద పెద్ద పేరులేని ఆ చెట్ల నీడలో 'ఆది' ఒంటరిగా కూర్చున్నాడు...

వాడి చూపు దూరంగా వున్న తన వాళ్ళమీద వుంది.

తాతలు... బాబాయిలు... మావయ్యలు... అత్తలు... పిన్నమ్మలు ... దూరపు దగ్గర బంధువులు... ఎంతో మంది గుంపులుగా... ఆ చెట్లనీడల్లో అటూ ఇటూ తిరుగుతూ ... ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

చిన్న చిన్న పిల్లలు చెట్లతీగలు... వ్రేళ్ళ మీదగా కొమ్మల మీదకి పాకి... కదులుతూ ... అరుస్తూ ... తోసుకుంటూ గొడవ గొడవగా వున్నారు... పెద్దవాళ్ళు కొందరు ముందున్న పళ్ళని లాక్కుంటూ పీక్కుంటూ తింటున్నారు...

ఎక్కువగా తిన్న కొందరు ... చెట్లకి ఆనుకుని సోమరితనంగా పడుకుని అటూ ఇటూ దొర్లుతున్నారు...

కొందరు పనికిరాని కబుర్లు చెప్తున్నారు...

కొందరు మళ్ళీ ఆకలివేస్తే ఏం తినాలా అని ముచ్చటించుకుంటున్నారు... కొందరు చలివేస్తే ... ఎక్కడ వుండాలో చర్చించుకుంటున్నారు... కొందరు వానవస్తే .... ఎక్కడ తలదాచుకోవాలో మాట్లాడుకుంటున్నారు... అంతకంటె ఎవరికీ పెద్దగా ఆలోచన లేదు... చేసే పనీ లేదు...!

'ఆది' ఒక్కడూ మాత్రం తన వాళ్ళందర్నీ చూస్తూ ఆలోచిస్తున్నాడు...

ఇంతేనా జీవితం అంటె...? తినటం... పడుకోవటం... లేవటం... మళ్ళీ తినటం... పడుకోవటం ... లేవటం...! ఇదేనా జీవితం అంటే...? చెయ్యవలసిన పని ఏమీలేక ... సాధించవలసిందంటూ ఏదీలేక... ముందుతరాల వాళ్ళలాగే బ్రతికినంతకాలం... బ్రతికేసి... చావటం తప్ప వేరే ఏవీ లేదా...?

వెలుగు వచ్చినప్పుడు అటూ ఇటూ వెళ్ళటం –

చీకటి రాగానే ఓ చోటకి చేరి పడుకోవటం –

వాన వచ్చినప్పుడు తడవకుండా చెట్ల కిందకి చేరటం –

చలి వేసినప్పుడు దగ్గర దగ్గరగా చేరటం.

ఆకలికి తినటం –

నరాలు లాగినపుడు ఆడ–మగ ఏ ప్రక్కనో కలవటం – ఎప్పుడో ప్రమాదం వలనో ... వయసు అయిపోవటం వలనో చావటం...

ఇంతేనా ... ఇదేనా ... ఇంకేమీ లేదా... జీవితం అంటే...?

ఆలోచిస్తున్నాడు 'ఆది'.

హఠాత్తుగా ఏదో పెద్ద శబ్దం... నేల కదులుతున్నట్లు ... చెట్లు గజగజలాడుతోన్నట్టు... 'ఆది' తాలూకు వాళ్ళంతా ... కంగారుగా గబగబా .. చెల్లాచెదురుగా అటూ ఇటూ పోతున్నారు భయంతో. ..

'ఆది' మెల్లగా కదిలి నాలుగు కాళ్ళ మీద తల్లి పిలిచినవేపు నడవడం మొదలుపెట్టాడు...

ఆది ఒక కోతి... ఇది ఐదు మిలియన్ సంవత్సరాల క్రితం నాటి విషయం...

** ** **

'నారి' నాలుగు కాళ్ళమీద నడుస్తూ ... కొమ్మల్లోంచి కిందకి జారింది... నేలమీద ముందుకు నడుస్తూ... తల తిప్పి చూసింది...

దూరంగా ... నిన్న సాయం కాలం నుంచి పెద్ద శబ్దం చేస్తూ మంటలు కక్కుతున్న ఓ అగ్నిపర్వతం ఇంకా ... పెద్ద శబ్దాలు చేస్తోంది... నేల అప్పుడప్పుడు అదురుతూనే వుంది...! ముందుగా భయంతో చెల్లాచెదురయిన దాని జాతి గుంపు అంతా మళ్ళీ ఒకచోట చేరుకున్నారు... ఆ గుంపులో ఆదిగాడు కనిపించకపోవడంతో "నారి" అతన్ని వెతుక్కుంటూ కదులుతోంది...!

ఈ మధ్య నారికి ఆది మీద ఏదో తెలియని ఫీలింగ్ కలుగుతోంది.. ఎందుకో తనకి ఆదిని చూడాలని అస్తమానూ అనిపిస్తోంది... ఆదికి దగ్గరగా వుండాలి – ఆది ఒంటికి తను ఆనుకోవాలని... ఆది ప్రక్కగా పడుకోవాలని – తను తినే పళ్ళు ... కాయలు ఆదికి పెట్టాలని, ఆదితో ఏవేవో కబుర్లు చెప్పాలని అనిపిస్తోంది... ఎందుకు అలా అనిపిస్తోందో నారికి అర్థంకాక... వరసకి పిన్ని అయిన మరో కోతిని అడిగింది...

"నీకు తెలీదే వెర్రిమొద్దూ... ఒకప్పుడు నాకూ మన తండాలో ... ఆ ఎర్రగా పొట్టి తోకతో వుంటాడు చూడూ అతన్ని చూస్తే అలాగే అనిపించింది.. వాడితో చెప్పాను... వాడూ అలా ఎందుకు అనిపిస్తుందో తనకూ తెలీదన్నాడు... ఇద్దరం ఆ రాళ్ళప్రక్కన కలిసి దొర్లాం... ఆ తరవాత ఆ పసివెధవ పుట్టాడు..." అని దూరంగా గెంతే ఓ పిల్లకోతిని చూపించింది...

ప్రతివాళ్ళకి ఇలాగే అనిపిస్తుందన్న మాట... అనుకుంది నారి.

అలా ఎందుకు అనిపిస్తుందో ... అదేవిటో దానికి అర్థం కావడం లేదు!



దానికే కాదు... అప్పటినుంచీ ఐదు మిలియన్స్ సంవత్సరాల తరవాత ఇప్పటివరకూ అదేవిటో... ఎవరికీ అర్థం కావటం లేదు... కానీ ఆ ఫీలింగ్‌కి పేరు మాత్రం పెట్టుకున్నారు "ప్రేమ" అని.

** ** **

ఆది నాలుగు కాళ్ళలో ... వెనక రెండూ నేలమీద వుంచి ...

ముందు రెండిటిని గాలిలో పైకి ఎత్తటానికి ప్రయత్నిస్తున్నాడు... కాస్త కాస్తగా అవి లేస్తున్నాయి...

ఐదంగుళాలు పైకి ఎత్తేటప్పటికి బాలెన్స్ తప్పి... ప్రక్కకి పడిపోయాడు ... దులువుకుంటూ నాలుగు కాళ్ళ మీద లేచి ... మళ్ళీ రెండు వెనక కాళ్ళని బలంగా మట్టిలో తొక్కిపట్టి ముందు రెండుకాళ్ళు ఎత్తడానికి సిద్ధ పడుతున్నాడు...

కాని అంతకాలం అడ్డంగా వున్న వెన్నెముక – పిరుదల దగ్గర ఎముక – ముందుకు వాలివుండే వెనక కాళ్ళ తొడ ఎముకలు – కొత్తగా వాడు చేస్తోన్న పనికి సహకరించక పోవడంతో ... నడుం దగ్గర నొప్పితో మళ్ళీ బాలెన్స్ తప్పి ... ముందుకు పడ్డాడు... నుదురు నేలనున్న రాతికి తగిలి చిట్లింది. "అబ్బా" అన్నాడు.

వాడికోసం వెతుక్కుంటూ వచ్చి ... ఎత్తయిన రాళ్ళమీద నుంచి ఇందాకటి నుంచి ఆశ్చర్యంగా వాడి చేష్టల్ని గమనించే 'నారి' ఒక్కసారిగా నాలుగుకాళ్ళ మీద పరుగున వచ్చింది... పడ్డవాడిని లేవదీస్తూ...

"ఏవిటి నువ్వు చేస్తున్న పని..." గాబరాగా, కంగారుగా అడిగింది.

ఆది నాలుగు కాళ్ళమీద నుంచుని దానికేసి చూస్తూ...

"ఏం లేదు... పూరికే వుండటం నచ్చక"

"పూరికే వుండటం నచ్చక... ఇలా పిచ్చి చేష్టలు చేసి దెబ్బలు తగిలించుకోవాలా..."

అంటూ వాడి నుదుటికి వున్న రక్తాన్ని తుడిచింది...

అలా తుడుస్తున్న నారికి మళ్ళీ అదోరకంగా అనిపిస్తోంది... వాడి దగ్గరతనం అదో విధమైన తన్మయత్వం కలిగిస్తోంది దానికి.



ముందు కాళ్ళు వాడి నడుం మీద వెయ్యాలని, తన నాలికతో వాడి నాలికని తాకాలని, ఇద్దరూ నేలమీద కలిసి పడాలని ... ఏదో ... ఏవిటో...!

"పద ... వెళదాం... మీ అమ్మ నువ్వు కనిపించకపోతే కంగారుపడుతుంది... పద..."

"నేను రాను... నువ్వెళ్ళు..."

"నువ్వేం చేస్తావిక్కడ...?"

మాట్లాడకుండా ఆది ... కదిలాడు...

నారి వాడినే చూస్తోంది...

వాడు ఎడంగా వున్న ఒక రాయి దగ్గరకి నాలుగు కాళ్ళమీద వెళ్ళాడు.

రాయి వంక చూశాడు.. అది పది అడుగుల ఎత్తున్న పెద్ద కొండరాయి ... దాన్ని చూసేవాడికి ఏదో ఆలోచన –

దగ్గరగా దానివేపు తిరిగి... ముందు కాళ్ళు ఎత్తాడు... ఆ రాయిమీద ఆన్చాడు...

అవి జారుతున్నాయి... పళ్ళ బిగువున జారకుండా రాతికి నొక్కి వుంచాడు.

అడ్డంగా వుండే వెన్నెముక – నిలువుగా ఒంగక నొప్పి పెడుతోంది...

వాడు భరించి ... అలాగే వున్నాడు...

మెల్లగా రాయి నుంచి ... ముందు కాళ్ళు వెనక్కి తీశాడు...

క్షణంసేపు వెనక కాళ్ళమీద నుంచున్నవాడు ... బాలెన్స్ తప్పగానే... ఛటుక్కున ముందు కాళ్ళు రాయికి ఆన్చాడు.

కాసేపు అలాగే వుండి... మళ్ళీ రాయికి ఆన్చిన ఆ కాళ్ళని వెనక్కి తీశాడు...

క్షణం వుండి... పడబోగ... మళ్ళీ రాయికి ఆన్చాడు.

'నారి'కి అర్థం కావడంలేదు వాడి ప్రవర్తన...!

విపరీతంగా అనిపించే వాడి చేష్టలకి అది బెదిరింది...

ఎందుకేనా మంచిది వాడి తల్లితో చెప్పాలని అనుకుని వెనక్కి తిరిగింది.

రాయి ఆధారంగా 'ఆది' వెనక కాళ్ళమీద నుంచోటానికి ప్రయత్నిస్తున్నాడు...

**సృష్టి ఆరంభంనుంచి – ఈనాటి వరకూ ప్రాణులు చేసిన సాహసకృత్యాలలో అతి గొప్ప సాహసచర్య The greatest adventure అది చేస్తున్నాడు. ఆ పని మానవజాతికి పునాది అని – మనిషి పుట్టుకకి ఆరంభమని ఐదు మిలియన్ సంవత్సరాల క్రితం – ఆ కొండ రాయి ప్రక్కన – వెన్నునొప్పి – కాళ్ళనొప్పి భరించి ... రెండు కాళ్ళమీద నిలబడటానికి ప్రయత్నించే 'ఆది' అనే ఆ కోతికి తెలీదు.**

** ** **

"ఏవిట్రా ... నువ్వు రోజంతా చేసిన పని..."

తల్లి 'ఆది'ని సీరియస్‌గా అడిగింది.. ఒళ్ళంతా నొప్పులతోనూ... నడుం దగ్గర పట్టేసినట్టుగా వున్న బాధతోనూ ... చిన్న చిన్న దెబ్బలతోనూ.... వచ్చిన ఆది ... తల్లి ప్రక్కగా వున్న నారి కేసి చూశాడు. అది నాలుగు కాళ్ళ లోకి తలపెట్టుకుని కూర్చుంది. అదే చెప్పిందని వాడికి అర్థమయింది.

"దానికేసి చూస్తావేం ... నాకు జవాబు చెప్పక..."

రెండు కాళ్ళమీద నిలబడటానికి ప్రయత్నించడం ఏవిట్రా... మతిగాని పోయిందా..." కోపంతోనూ కొడుకు మీదుండే వాత్సల్యంతోనూ అడిగింది. వాడు జవాబివ్వలేదు...

"ఎందుకురా అలాటి ... అర్థంలేని పన్లు చేసి ప్రాణాల మీదకి తెచ్చుకోటం... నీతోటి వాళ్ళు చూడు... చక్కగా."

"తిని – పడుకొని – లేచి – అటూ ఇటూ తిరిగి – తిని పడుకుంటున్నారు... అదే చెయ్యమంటావు... అంతేగా" ఆది అన్నాడు.

"అదికాక.. ఇంకేం చేస్తాం మనం..."

ఆశ్చర్యంగా అడిగింది ఆది తల్లి.

"అదే చెయ్యడానికయితే అసలు బతకడం దేనికి...". మొహం తిప్పకుని అన్నాడు ఆది.

నిశ్చేష్టురాలయింది తల్లి.

'ఆది' మౌనంగా చెట్టు మొదలు దగ్గర పడుకున్నాడు. 'నారి' నిశ్శబ్దంగా కాస్త బాధగా వెళ్ళిపోయింది.

నాలుగు కాళ్ళమీద – రెండడుగులు కొడుకుకేసి వేసి పడుకున్న వాడి వంక చూసింది తల్లి.

ఏవిటి వీడు?

అందరితోనూ కలిసి వుండక – అదో రకంగా వుంటాడు...

ఎప్పుడూ ఒంటరిగా – ఏదో ఆలోచిస్తూ వుంటాడు...

గెంతుతూ – ఆడుతూ కాలం గడపవలసిన వయసులో వీడు రెండు కాళ్ళమీద నించునే పిచ్చి పనులు చేయడం ఏవిటి...? ఏమయింది వీడికి...?

ఆ తల్లికి తెలీని దిగులు ... దుఃఖం కలిగాయి.

"లేవగానే వాడికి కాస్త మెల్లగా నచ్చచెప్పాలి..." అనుకుంటూ కొడుకు దగ్గరగా పడుకుంది ఆమె.

ఆకాశం నల్లగా... చీకటిగా మారింది... ఎక్కడో అగ్నిపర్వతం ఇంకా బద్దలవుతూనే వుంది.

రకరకాల పేరు తెలియని పక్షులు ... పెద్ద పెద్ద జంతువులు.. విచిత్రమైన శబ్దాలు చేస్తున్నాయి...

**దగ్గరగా ఎదిగిన రాక్షస చెట్లతో వున్న ఆ ప్రదేశం ఐదు మిలియన్ల సంవత్సరాల తర్వాత ఆఫ్రికా... అని పిలవబడబోతుంది!**

** ** **

తెల్లవారింది...

'ఆది'గాడి తల్లి మెల్లగా లేచింది...

కొడుకుతో ఈ పూట కాస్త మంచిగా మాట్లాడి... దార్లో పెట్టాలి... అనుకుంది.

తల తిప్పి చూసింది 'ఆది' లేడు...

"ఆదీ" – అని పిలిచింది.. కదలి ... అరిచింది ఆ తల్లి...

** ** **

'ఆది' అతికష్టం మీద రెండు కాళ్ళమీద నుంచున్నాడు... ముందుకాళ్ళు కొండరాయికి ఆన్చాడు.. .

కాసేపు ఆగి... వాటిని వెనక్కి తీశాడు... బాలెన్స్ కష్టంగానే వుంది... అప్పటికి కొన్నివేల సంవత్సరాలుగా ఆ జంతువుల శరీర నిర్మాణం నాలుగు కాళ్ళమీద నడవటానికి తగినట్టుగా ఏర్పాటు అయింది.. ఇప్పుడు దాన్ని మార్చాలని చేసే వాడి ప్రయత్నం ... శారీరకంగా అసాధ్యమైంది.

**అసాధ్యమైంది ఏదో చేయాలని ప్రయత్నించే ప్రతి మొదటి ప్రాణికి కష్టం – బాధ తప్పవు....**



వెన్నెముక దగ్గర కలుక్కుమంటోంది నొప్పి...

అయితే ఈసారి రెండు నిమిషాలు ... బాలెన్స్‌గా రాయికి ఆనుకోకుండా నిలబడగలిగాడు ఆది...

వాడిలో కాస్త ఆనందం... సంతోషం... అంతలోనే దబేల్‌ని ప్రక్కకి పడ్డాడు... తల దిమ్మెక్కింది. ఊపిరి అందనట్టయింది... కాసేపు అలాగే వుండిపోయాడు.

దూరంగా చెట్టునీడలో కూర్చుని వున్న 'నారి' కదల్లేదు. నెల రోజులుగా వాడి వెనకగా వస్తోంది... వాడ్ని దూరం నుంచే గమనిస్తోంది. వాడ్ని లేవదీయ దానికి దగ్గరకి వెళితే వాడు కసురుకుంటాడని దాని భయం... నాలుగయిదుసార్లు కసురుకున్నాడు కూడా... అందుకే నిశ్శబ్దంగా వాణ్ణి గమనిస్తోంది...

వాడి బాధకి దానికి కళ్ళలో నీళ్ళు నిలిచాయి...

మళ్ళీ 'ఆది' లేచాడు... పళ్ళు బిగించి... రాతికి ముందు కాళ్ళు ఆన్చాడు... వెనక కాళ్ళు బలంగా నేలమీద నొక్కిపెట్టి ముందు కాళ్ళు తీశాడు... బాలెన్స్ కాస్త పరవాలేదు...

కాసేపు అలాగే నిలబడి ... రాయిని ముట్టుకోకుండా నుంచుని వెనక కాళ్ళని కదపాలని వాడి ఉద్దేశ్యం...

కదిపితే పడిపోవచ్చు...

అయినా కదపాలి.. లేకపోతే తన ప్రయత్నానికి ప్రయోజనం ఏవిటి... తన కష్టానికి ఫలితం ఏవిటి...

కాని కదిపి... అడుగు ఎలా వెయ్యాలి...? తన కాలు సహకరిస్తుందా...? వెన్నెముక వాలిపోక – నిటారుగా వుంటుందా...?

తల బరువుతో వెనక్కి వాలిపోతుందేమో? పడితే పెద్ద దెబ్బ తగులుతుందేమో?

అయినా కాలు కదపాలి... అడుగు వెయ్యాలి... తప్పదు...

దూరంగా చెట్టుకింద వున్న 'నారి' వూపిరి బిగబట్టి వాడ్ని చూస్తోంది... వాడు అలా నుంచోటం తమాషాగా వుంది... అలా నిలబడిన వాడు ఏం చెయ్యాలనుకుంటున్నాడు... ఏం చేస్తాడు...?

'ఆది' తెగించాడు... ధైర్యం చేశాడు... మెల్లగా కుడికాలు కాస్త పైకి ఎత్తాడు...

'నారి' బిగుసుకుపోయి చూస్తోంది... ఊహకందని విషయం... ఊహాతీతమైన దృశ్యం అది చూస్తోంది..

ఎత్తిన కుడికాలుని ... కాస్త ముందుకి వేస్తున్నాడు...

**అది ... జంతువుల నుంచి మానవ జాతిలోకి పడుతున్న మొదటి అడుగు... సృష్టిని మలుపుతిప్పే అడుగు... మనిషి పుట్టుకకి కారణం అయిన అడుగు... చంద్రుడి మీద మనిషి మొదటిసారి వేసిన అడుగు కంటె – అతి గొప్ప అడుగు...**

వేశాడు 'ఆది'...

మొదటిసారిగా ... రెండు కాళ్ళమీద నిలుచున్న 'ఆది' మొదటి అడుగు వేశాడు..

పుడమితల్లికి మనిషిని కనే పురిటినొప్పులు ఆరంభమయ్యాయి...

'ఆది' మరుక్షణంలో తూలి... శబ్దంతో ముందుకు పడి ... రెండు కాళ్ళమీద నుంచి దొర్లి... గోతిలో పడ్డాడు...

'నారి' భయాందోళనతో వాడికేసి పరుగెత్తింది...

** ** **

ఆ చెట్ల కింద ఆ కోతి జాతి తండా అంతా గుంపుగా చేరి వున్నారు... వృత్తాకారంగా ... ఆ మూక అంతా నిశ్శబ్దంగా కూర్చుని వున్నారు... ముసిలివాడు తండా నాయకుడు అయిన 'సనాతన' గంభీరంగా వున్నాడు... ముసిలి కోతులు పెద్దరికాన్ని సూచించే మొహాలతో మౌనంగా వున్నాయి... వెనకగా పిల్లకోతులు నాలుగుకాళ్ళ మీద నిలుచుని కుతూహలంగా వున్నాయి... వయసులో వున్న కొన్ని చెట్ల కొమ్మలమీద వేలాడుతున్నాయి...

గుంపు మధ్య ఆడకోతుల ముందు 'ఆది' తల్లి – 'నారి' కాస్త దిగులుగా వున్నాయి... ఏదో తీర్పు జరగబోతోందన్నట్టు వుంది అక్కడి వాతావరణం...

అదే సమయంలో ఓ పెద్దకోతి పిలుచుకురాగా... నాలుగు కాళ్ళమీద నడుచుకుంటూ అక్కడికి వచ్చాడు 'ఆది...'

వాడి ఒళ్ళు... అక్కడక్కడ దెబ్బలతో.. మానని గాయాలతో... మాని

పోయిన గాయాలతో వుంది...

మధ్యకి వచ్చినవాడు నిశ్శబ్దంగా పెద్ద లవంక చూశాడు...

పొట్టిగా వున్న తోకని కదిపి... ముందువేపు కుడికాలుతో బుర్రగోక్కుని 'సనాతన' ఆది వంక చూస్తూ అన్నాడు...

"ఆదీ ... రెండు నెలలుగా నీ ప్రవర్తన గురించి మేము వింటోన్నది నిజమేనా..."

"ఏ విషయంలో...?" ఎదురుప్రశ్న వేశాడు 'ఆది'...

"అదే నువ్వు కుదురుగా వుండక... రెండు కాళ్ళమీద నిలబడాలని ఏవో అర్థంలేని ప్రయత్నాలు చేస్తున్నావట..."

"నిజమే..." మెల్లగా ఒప్పుకున్నాడు 'ఆది'. అంతటితో ఆగక "కాకపోతే అది అర్థంలేని ప్రయత్నం అని నేను అనుకోవడం లేదు..." అన్నాడు.



'సనాతన'కి కాస్త ఇరిటేషన్ వచ్చింది...

"మరి అది మహత్తర కార్యక్రమం అనుకుంటున్నావా...? భగవంతుడు మనకి నాలుగు కాళ్ళు ఇచ్చింది ఎందుకు...? వాటితో నడవమని... వాటిని నడవటానికి ఉపయోగించి బ్రతకమని ... అంతేగాని... సృష్టికి విరుద్ధంగా ... రెండు కాళ్ళమీద నుంచోటాలు.. రెండు కాళ్ళతో నడవటాలు చెయ్యమని కాదు..."

అంతా సనాతన మాటలకి అవునన్నట్టు గంభీరంగా తలలూపారు.. దాంతో 'సనాతన' మరికాస్త పెద్దరికం ప్రదర్శిస్తూ –

"ఒక్కొక్క ప్రాణిని ఒక్కొక్క రకంగా బ్రతకమని పుట్టించాడు దేవుడు...

యుగయుగాలుగా అదే పద్ధతిలో ప్రాణులు బ్రతుకుతున్నాయి... అందుకు విరుద్ధంగా వుండాలనుకోవటం ... ప్రవర్తించాలి అనుకోవటం... బ్రతకాలి అనుకోవటం ... తప్పు... నేరం... పాపం... అర్థమయిందా..." అన్నాడు.

'ఆది' మెల్లగా అన్నాడు.

"యుగయుగాలుగా వున్న పద్ధతిగానే ఇప్పుడు... ఎందుకు వుండాలి...? కొత్త విధానం గురించి ఎందుకు ఆలోచించకూడదు...? మన అవయవాల్లోని శక్తిని మనకి ఉపయోగకరంగా మార్చుకోటానికి ఎందుకు ప్రయత్నించకూడదు...? అయినా నాకు నచ్చిన విధానాన్ని నేను అనుసరించాలి అనుకోవటం ... తప్పు... నేరం... పాపం... ఎందుకు అవుతుంది...?" ధైర్యంగా అడిగాడు...

వాడి ధైర్యానికి అంతా నిశ్చేష్టులయ్యారు.

వాడి ధైర్యానికి వాడి తల్లి భయపడింది.

వాడి ధైర్యానికి 'నారి' థ్రిల్ అయింది.

వాడి ధైర్యానికి పెద్దలు నివ్వెరపోయారు.

వాడి ధైర్యానికి 'సనాతన' అవమానం ఫీలయ్యాడు... ఇరిటేషన్ ఎక్కువ అయింది.

"తప్పు.. నేరం... పాపం... ఎందుకు అవుతాయని ప్రశ్నించేటంత మొనగాడివయ్యావురా... ఒరే ... తరతరాలుగా మన తండ కొన్ని సాంప్రదాయాలకి – ఆచారాలకి – జీవన విధానాలకి కట్టుబడి వుంటోంది...

ఎవరి మటుకు వాళ్ళు నాకు నచ్చినట్టు వుంటాను... అని ఎదురుతిరిగితే... జాతి కట్టుబాట్లు లేకుండా అస్తవ్యస్తమవుతుంది...

అందులోనూ నువ్వు చేసేపని... మన కోతి జాతికే విరుద్ధమయింది...

మన మనుగడకి ప్రమాదం తెచ్చే పని చెయ్యడం ... సాంప్రదాయాన్ని ధ్వంసం చేయటం... ఆచారానికి అన్యాయం చెయ్యటం... మేము ఎవరూ హర్షించం..." పెద్ద పెద్ద మాటలతో తను చాలా బాగా చెప్పానని తృప్తి ఫీలయ్యాడు 'సనాతన'... మిగిలిన ముసలివాళ్ళ వంక చూశాడు మీరేం అంటారన్నట్టు...

బొంగురుగొంతు సవరించుకొని ఒక ముసలి కోతి అన్నాడు –

"సనాతన చెప్పింది నిజం... సాంప్రదాయాన్ని పాటించాలి..."

"ఆచారాలకి తలవంచాలి..." – మరొకడు అన్నాడు.

"వందల ఏళ్ళుగా మన తాతముత్తాతల్లాగే నాలుగు కాళ్ళ మీద నడుస్తూ కోతుల్లాగే బ్రతకాలి..." మరొకడు అన్నాడు.

అందరి సపోర్ట్ చూసి 'సనాతన' కాస్త రెచ్చిపోయి –

"ఒరే ఆదిగా... విన్నావా... మనం, మన జీవితాలూ ఎప్పటిలాగే సాంప్రదాయబద్ధంగా సాగాలి... ఇప్పుడే కాదు మరో వెయ్యేళ్ళు లక్ష ఏళ్ళయినా ఇలాగే వుండాలి... ముందుతరాల వాళ్ళు మన నాలుగుకాళ్ళ అడుగుజాడల్లో నడవాలి.. అర్థమయిందా..." అన్నాడు.

'ఆది' ఏ మాత్రం జంకు లేకుండా అప్పుడు ఇలా అన్నాడు–

"ఏవిటి మన సాంప్రదాయం...? ఏవిటి మన ఆచారం...? ఏవిటి మన జీవన విధానం...?

పుట్టి – తిని – పడుకుని – లేచి – పనిలేక తిరిగి ... ఓనాడు చావటమేనా మన జీవన విధానం...?

కొమ్మల్లో తిరుగుతూ... వేలాడుతూ .... మనకంటే పెద్ద జంతువులు వస్తే బెదిరి దాక్కుని – వానకి వణికి ... ఎండకి ఎండి... చీకటికి బెదిరి... ఆకలికి ఏడ్చి ... అంతమవటమేనా మన ఆచారం...?

ఆలోచన లేక కొత్తది ఏదో కనిపెడదామనే తపన లేక – ఏదో చెయ్యాలనే తాపత్రయం లేక – జీవితానికి అర్థం లేక – మార్పుకోసం ప్రయత్నం లేక – ఏదయినా సాధించాలనే తెగింపు లేక ఈ లోకం ఎందుకు ఇలాగ వుంది. మన బ్రతుకులు ఎప్పటికీ ఇంతేనా... ఈ సృష్టి రహస్యం ఏవిటి అనే జిజ్ఞాస లేక సోమరితనంగా కాలం గడపటమేనా మన సాంప్రదాయం...?

దేవుడు మనల్ని ఇలా పుట్టించాడు... ఇలాగే బ్రతకమన్నాడు... అంటూ మనల్ని మనం సమర్థించుకొని రోజులు వెళ్ళబుచ్చటమేనా... జీవితం...? అదే జీవితం అయితే – ఎందుకు అలా జీవించటం...?"

ఆవేశంగా కాక తాపీగా చెప్పి ఆపాడు ఆది.

అంతా నిశ్శబ్దం...

'సనాతన'తో బాటు పెద్దల మొహాలన్నీ నెత్తురుచుక్క లేనట్టయ్యాయి...

చెట్లమీద యువకులు ఆశ్చర్యంగానూ... ఆదితల్లి – నారీ తెల్లబోయినట్టు వుండిపోయారు...

ఆది అన్నాడు మళ్ళీ – "అర్థంలేని సాంప్రదాయం... అర్థంకాని ఆచారం... ఎదుగులేని జీవన విధానం నాకు అవసరం లేదు... నేను నాకు నచ్చిన పని చేస్తాను... నచ్చినట్టుగా చేస్తాను..." అన్నాడు! ఉక్రోషం – వుడుకుమోత్తనం – అవమానం పొంగగా 'సనాతన' –

"ఒరేయ్... నువ్వు మన జాతిలోనే తప్పబుట్టావు.. భ్రష్టుడా..." అంటూ కోపంగా చేతికి అందిన రాయి తీసుకుని ఆది మీదకి విసిరాడు... 'ఆది' నుదుటికి తగిలింది.

(మిగతా కథ వచ్చేవారం)